క్లుప్తంగా

ఎంపీ వేమిరెడ్డికి సన్మానం



నెల్లూరు (దర్గామిట్ట): రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌టీయూసీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల వైఎస్సార్‌టీయూసీ ఇన్‌చార్జి నారపరెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ఎస్ ముత్యంగౌడ్, రాష్ట్ర నాయకులు మండ్ల రాజేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి కుమార్‌పాల్, కిరణ్, తదితరులు ఎంపీని కలిసి శాలువాలతో సత్కరించారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న కమిషనర్, డీఎంహెచ్‌ఓ

నెల్లూరు(బారకాసు): రక్తదానం ప్రాణదానంతో సమానమని కమిషనర్ వికాస్‌మర్మత్ అన్నారు. రొట్టెల పండగను పురస్కరించుకుని నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కమిషనర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సహకారంతో రొట్టెల పండగ జరిగే ఐదు రోజుల పాటు రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో దర్గా ప్రధాన మార్గాల సమీపంలో వయోవృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి దర్గా దర్శనం కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం స్వచ్ఛంద రక్తదాతలను అభినందించారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యురాలు మొబీనా, మేనేజర్ ఇనాయతుల్లా, వైద్యులు సింధూజ, శ్రావ్య, దిలీప్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు జయసింహ, మధుసూదన్‌రావు, భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

నెల్లూరు(మినీబైపాస్): కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని ప్రవాస్ యోజన ఇన్‌చార్జి, బీజేపీ తెలంగాణా రాష్ట్ర అధికార ప్రతినిధి యమునా పాఠక్ పేర్కొన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని కోరారు.



బారాషహీద్‌లను దర్శించుకుంటున్న భక్తులు



శనివారం రాత్రి స్వర్ణాల తీరంలో భక్తజన కోలాహలం

మదినిండా భక్తి భావంతో..

మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే రొట్టెల పండగ నగరంలోని బారాషహీద్ దర్గాలో శనివారం ప్రారంభమైంది. తొలిరోజు వరాల రొట్టెను పట్టుకునేందుకు దేశ నలుమూలల నుంచి భక్త జనం పెద్దఎత్తున స్వర్ణాల చెంతకు తరలివచ్చారు. మది నిండా భక్తి, విశ్వాసంతో తమ కోరికలు తీరాలని రొట్టెలు మార్చుకుని బారాషహీద్‌లను దర్శించుకున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



బారాషహీద్‌ల దర్శనానికి బారులు తీరిన భక్తులు



దర్గా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం



బారాషహీద్ దర్గాలో విద్యుద్దీపాలంకరణ



రొట్టెల పండగకు తరలివస్తున్న భక్తులు



సౌభాగ్య రొట్టెను అందజేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

భక్తజన కోలాహలం..

నెల్లూరు(మినీబైపాస్): రొట్టెల పండగ సందర్భంగా స్వర్ణాల తీరంలో భక్తజన కోలాహలం నెలకొంది. బారాషహీద్‌లను దర్శించుకుని స్వర్ణాల తీరంలో రొట్టెలు పట్టుకుంటే కోరుకున్న కోర్కెలు తీరుతాయనే నమ్మకంతో దేశ నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. గతేడాది కోరుకున్న కోర్కెలు నెరవేరడంతో కొందరు భక్తులు రొట్టెలు వదలగా, మరికొందరు తమ కోర్కెలు నెరవేరాలని వాటిని పట్టుకున్నారు. గృహరొట్టె, ఉద్యోగ, చదువు రొట్టెలకు డిమాండ్ నెలకొంది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల తమ మనోగతాలను వెల్లడించారు.



రొట్టెలు మార్చుకుంటున్న భక్తులు

ఇంటి రొట్టె తీసుకున్నా



మాది నెల్లూరు. ఇల్లు కట్టుకోవాలనే కోరికతో ఇంటి రొట్టెను తీసుకున్నా. తొలిసారిగా ఇక్కడకు వచ్చా. ఇల్లు కట్టుకోవాలన్నది నా కోరిక. మా ఇంటి దగ్గర రొట్టెల పండగ గురించి చెప్పారు. కోరికలు కోరుకుని రొట్టెను తీసుకుంటే తీరుతాయని చెప్పారు. అందుకే రొట్టెను పట్టుకున్నా.

–ప్రదీప్, నెల్లూరు

ఇంటి కల నెరవేరింది



గతేడాది రొట్టెల పండగకు వచ్చి ఇంటి రొట్టెను పట్టుకోగా ఆ కల నెరవేరింది. అందుకే ఈ ఏడాది మళ్లీ వచ్చి ఇంటి రొట్టెను వదిలాను. మళ్లీ ఇంకో ఇల్లు కట్టాలని రొట్టెను పట్టుకున్నా.

–లక్ష్మి, నెల్లూరు

ఆరోగ్య రొట్టె అందుకున్నా

మాది సూర్యాపేట. గత మూడేళ్లుగా రొట్టెల పండగకు వస్తున్నాం. ఈ ఏడాది ఆరోగ్య రొట్టెను పట్టుకున్నా. ఇటీవల ఆరోగ్యం సహకరించడం లేదు. అందుకే ఆరోగ్యం మెరుగుపడాలని ఆరోగ్య రొట్టెను తీసుకున్నా.

–ముజీబ్‌ఖాన్, సూర్యాపేట

పెళ్లి రొట్టెను పట్టుకున్నా



కర్నూలు నుంచి కుటుంబంతో పాటు వచ్చా. ఏటా రొట్టెల పండగకు వస్తాం. ఈ ఏడాది పెళ్లి రొట్టెను పట్టుకున్నాను. మా కుటుంబ సభ్యులందరికీ రొట్టెల పండగపై నమ్మకం. ఆ నమ్మకంతోనే ఈ రోజు ఇక్కడకు వచ్చాం.

–విజయ్,కర్నూలు

ఎంపీగా తాను, ఎమ్మెల్యేగా ఆదాల పోటీ చేస్తున్నాం

- రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(సిటీ): 2024 ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్ సభ్యుడిగా తాను, రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి పోటీ చేయనున్నామని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 12వ డివిజన్ వావిలేటిపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల చిరునవ్వే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండదండలని పేర్కొన్నారు. తామిద్దరం వైఎస్సార్‌సీపీ తరుపున పోటీ చేయనున్నామని, తమను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఆదాల మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు, ప్రజల మద్దతు, నాయకుల అండదండలతో తామిద్దరం ఘన విజయం సాధించడం తథ్యమని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గడప గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. వలంటీర్ల సేవలు బాగున్నాయన్నారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా అర్హులకు నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అర్హత ఉండి సాంకేతిక కారణాలతో ఎవరికైనా ఇంకా సంక్షేమ పథకాలు అందకుంటే వాటిని పరిష్కరించి అందేలా చూడాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రజల్లో గౌరవం పెరిగిందన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి బాధ్యతలు స్వీకరించటం తథ్యమని పేర్కొన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డిని గుండెల్లో పెట్టుకుంటున్నారని, ప్రజాబలంతో ఆయన తిరిగి సీఎం అవుతారన్నారు. నెల్లూరురూరల్ నుంచి ఆదాల ప్రబాకర్‌రెడ్డి ఘన విజయం సాధించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చెర్మన్ మెట్టుకూరి చిరంజీవి, నాయకులు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు బట్టేపాటి నరేంద్రరెడ్డి, రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు రవికుమార్, శ్రీకాంత్ రెడ్డి, వావిలేటిపాడు వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, శ్రీనివాసరావు, మోహన్ రెడ్డి, సుమన్‌రెడ్డి, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎంపీలు వేమిరెడ్డి, ఆదాల

ఎంపీలకు వినతి



ఎంపీ ఆదాలకు వినతిపత్రం అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి

నెల్లూరు(సిటీ): నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దొడ్డంరెడ్డి నిరంజన్‌రెడ్డి శనివారం కలిశారు. రైతులకు అండగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా విదేశాలకు పచ్చిబియ్యం ఎగుమతులను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకోవడం బాధాకరమన్నారు. కేంద్రం నిర్ణయంతో రైతులు నష్టపోతారని విన్నవించారు. రైతుపక్షపాతి అయిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో పాటు పార్లమెంట్‌లో చర్చించాలని వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఏపీబీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్,ప్రసాద్ పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం



నెల్లూరు(బృందావనం): మైపాడురోడ్డులోని వైకుంఠపురంలో ధర్మసింధు ఆధ్యాత్మిక సేవా సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి ఫ్రెండ్స్ ఫౌండేషన్ ట్రస్ట్ రూ.32వేలు విరాళం ప్రకటించింది. వైకుంఠపురంలోని కాశీనాయన ఆశ్రమంలో ఆలయ ధర్మకర్త ధన్వి శ్రీనివాస్‌కు ట్రస్ట్ సభ్యులు మదన్‌మోహన్, దిలీప్, రాజశేఖర్, శివ, తదితరులు శనివారం నగదు విరాళాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ధన్వి శ్రీనివాస్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా ధార్మిక కార్యక్రమాలకు ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఎంతో తోడ్పాటును అందిస్తోందని కొనియాడారు. జిల్లాలో గ్రామదేవతల ఆలయాల నిర్మాణం కోసం ధర్మసింధు ఆధ్యాత్మిక సేవా సమితి ఎంతో తోడ్పాటును అందిస్తోందన్నారు.

మహిమాన్విత దర్గాలు

నెల్లూరు(బృందావనం): మది నిండా భక్తి, విశ్వాసాలతో భక్తులు కోరుకున్న కోరికలను తీర్చే రొట్టెల పండగ శనివారం నుంచి ప్రారంభమైంది. ఐదురోజుల పాటు పండగ జరిగే స్వర్ణాల చెరువు చెంతనున్న బారాషహీద్ దర్గా ఆవరణలో పన్నెండు మంది అమర వీరుల సమాధులతో పాటు వారి బాటలో పయనించి వారి తత్వాన్ని అనుసరించిన బాబాల దర్గాలు సైతం వెలసి ఉన్నాయి. ఈ దర్గాలను సైతం భక్తులు ఎంతో విశ్వాసంతో దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకుంటుంటారు. బారాషహీద్ దర్గా ఆవరలో వెలసి ఉన్న ఐదు దర్గాలు కోరికలు తీర్చే దర్బార్లుగా ఖ్యాతి పొందుతున్నాయి. తమకు ఏ సమస్య వచ్చినా వారికి విన్నవించుకోవడం ద్వారా పరిష్కారం దొరుకుతుందన్నది భక్తుల విశ్వాసం.

హజరత్ పిక్కే పీర్‌షా ఔలియా బాబా దర్గా



బారాషహీద్‌దర్గా ఎదురుగా దక్షిణం వైపున ఉన్న ఈ దర్గాలో తీపి పదార్థాలు ఏమీ లేకుండా పాయసం చేసుకుని సేవిస్తే తీపిగా ఉండేదట. ఆ నాటి నుంచి పంచదార, బెల్లం లేకుండా పాయసం చేసుకుని దర్గాలో సేవించడం భక్తుల ఆనవాయితీ. ఉర్దూలో పిక్కా అంటే తీపిలేనిది కావడం.. పంచదార, బెల్లం లేకుండా చేసుకుని పాయసం తినడంతో ఈ దర్గాలో కొలువైన బాబా పేరు పిక్కే పీర్ బాబాగా ప్రసిద్ధి పొందారు.

సయ్యద్ అహ్మద్‌బాబా దర్గా



బారాషహీద్‌దర్గాకు పడమటి వైపున ఉన్న ఈ దర్గా లాల్‌దర్గాగా ప్రసిద్ధి పొందింది. బారాషహీద్‌ల అనన యుడిగా ఉన్న సయ్యద్ అహమ్మద్ బాబా పేరుతో ఈ దర్గా నిర్మితమైంది. ఆయన దశాబ్దాల క్రితం బారకాసు సెంటర్‌లో నివాసం ఉండేవారని, అక్కడే భక్తులను అనుగ్రహించేవారని మతపెద్దలు తెలిపారు. ఆ తరువాత బారాషహీద్ దర్గా వద్ద ఆయన స్థిర నివాసం ఏర్పరుచుకుని తనువు చాలించడంతో ఆ ప్రాంతంలోనే భక్తులు దర్గాను నిర్మించి ఆయన ధరించే దుస్తుల వర్ణం ఎరుపుతో తీర్చిదిద్దారు. కాలక్రమేణా భక్తుల నానుడితో సయ్యద్‌అహమ్మద్‌బాబా దర్గా లాల్‌దర్గాగా ప్రసిద్ధి చెందింది.

బీబీ సయ్యదా హుస్సేని బేగం(అమ్మాజీ) దర్గా



బారాషహీద్‌దర్గాకు పడమటి వైపున లాల్‌దర్గాకు ఎడమవైపున అమ్మాజీ దర్గా ఉంది. బారాషహీద్‌ల భక్తురాలైన సయ్యదా హుస్సేనీబేగం(రహ్మా) ఉరఫ్ జచ్చాబీ మా, ఉరఫ్ అమ్మాజీ మాగా ప్రసిద్ధి చెందారు. మహిళలు దర్గాను దర్శించుకుని తమను సమస్యల నుంచి కాపాడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటే పరిష్కారమవుతుండడంతో మహిళల ఆరాధ్యదైవంగా అమ్మాజీ నిత్య 'దువా'లు అందుకుంటున్నారు. దర్గాలో ధరించే గాజులతో దీర్ఘసుమంగళిగా ఉంటారని మహిళల విశ్వాసం.

జలాలుద్దీన్‌సాహెబ్ దర్గా



అమ్మాజీ దర్గాకు వెనుక వైపున హజరత్ సయ్యదినా జలాలుద్దీన్ షా ఖాదరి ఉరుఫ్ జలాలి బాబా సాహెబ్ దర్గా ఉంది. భక్తుల కోరికలు నెరవేర్చే బాబాగా ఉర్స్-ఏ-ముబారక్ హజ్రత్ సయ్యదినా జలాలుద్దీన్ షా ఖాదరి ఎంతో సుప్రసిద్ధులు. ఆయన ఎంతో శక్తివంతులని నమ్మకం. మనోవాచకాలతో కోరుకునే ఏ కోరికైన నెరవేరుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. బారాషహీద్‌లను దర్శించుకున్న భక్తులు తప్పనిసరి ఈ దర్గాను దర్శించుకోవడం ఆనవాయితీ.

పీర్‌బాబా దర్గా



బారాషహీద్ దర్గాకు వెళ్లే మార్గంలో తూర్పు దిక్కున దిగువ ఈశాన్యంలో హజరత్ సయ్యద్ ఆషిక్ హుస్సేని(పీర్‌బాబా) దర్గా ఉంది. బారాషహీద్‌ల భక్తుడిగా హజరత్ సయ్యద్ ఆషిఖ్ హుస్సేని(పీర్‌బాబా) ఎంతో ప్రసిద్ధులు. ఆయన తనువు చాలించిన అనంతరం శిష్యబృందం సయ్యద్ మషూర్‌అలీషా ఖాదరి శిష్యబృందం దర్గాను నిర్మించారు. బాబాను దర్శించుకుంటే కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం.

రొట్టెల పండగ సౌకర్యాల పర్యవేక్షణ

నెల్లూరు(బారకాసు): నగరంలోని బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగ తొలిరోజు భక్తులకు కల్పించిన సౌకర్యాలను కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్, అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరితో కలిసి జేసీ కూర్మనాథ్ శనివారం పర్యవేక్షించారు. ఐదు రోజుల పాటు జరుగనున్న రొట్టెల పండగకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు దర్గా ప్రాంగణం, రొట్టెలు మార్చుకునే స్వర్ణాల చెరువు ప్రాంతంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. బారాషహీదుల దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లలో భక్తులకు తాగునీటి వసతి, నీడ సౌకర్యం, క్యూలైన్ల వద్ద పోలీసుల బందోబస్తును వారు ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి కేంద్రాలకు నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖతో పాటు ప్రైవేట్ ఆస్పత్రులు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరాల్లో భక్తులకు అవసరమైన మందులు, ప్రథమ చికిత్స, అంబులెన్స్ సౌకర్యం, ఇతర వైద్య సదుపాయాలు అందించేలా చూడాలని సూచించారు. విద్యుత్ సరఫరా నిరంతరం ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు భక్తులు రాకుండా పహారాకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రొట్టెలు మార్చుకునే స్వర్ణాల తీరం వెంబడి చిన్నారులు నీళ్ల లోతుగా ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా పటిష్టమైన నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రత్యేకంగా మహిళా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ రొట్టెల పండగను విజయవంతం చేయాలని కోరారు. వారి వెంట డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఎంహెచ్‌ఓ వెంకటరమణ, ఎస్ఈ సంపత్‌కుమార్, తదితరులు ఉన్నారు.



ఉచిత తాగునీటి కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ, కమిషనర్

రైల్వేస్టేషన్లలో పటిష్ట బందోబస్తు



సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న రైల్వే డీఎస్పీ మల్లికార్జునరావు

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగకు జిల్లాకు తరలివచ్చే భక్తుల భద్రతా దృష్ట్యా రైల్వే స్టేషన్లలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నెల్లూరు రైల్వే డీఎస్పీ మల్లికార్జునరావు తెలిపారు. నెల్లూరు రైల్వేపోలీసుస్టేషన్‌లో నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన రైల్వే పోలీసులకు బందోబస్తుపై శనివారం ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతకల్ రైల్వే ఎస్పీ కే చౌడేశ్వరి ఆదేశాల మేరకు 60మంది రైల్వే సిబ్బందితో నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్, సౌత్, వేదాయపాళెం, వెంకటాచలం రైల్వేస్టేషన్‌లలో బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో రెండో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మఫ్టీలో క్రైమ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. సంతపేట, నవాబుపేట పోలీసులు, ఆర్పీఎఫ్ సహకారంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఆత్మకూరు బస్టాండ్, నక్కలోళ్ల సెంటర్, రంగనాయకులపేటగేటు, వేదాయపాళెం, తదితర ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా గస్తీని ఏర్పాటు చేశామన్నారు. రైల్వేస్టేషన్‌లలో రైళ్లు నిదానంగా వెళ్లేలా చర్యలు తీసుకున్నామన్నారు. నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల్లో భాగంగా తీసిన భారీ గుంతల చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.